సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 29 । జూన్ । 2024



భారీగా తగ్గిన చీనీ ధర
చీనీ ధర రోజురోజుకూ పడిపోతోంది. శుక్రవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో టన్ను గరిష్టంగా రూ.18 వేలు మాత్రమే పలికింది.



బంగారంతో ఇబ్బందులు దూరం
బంగారాన్ని ఇష్టపడని మనిషే ఉండడు. అలంకరణకే కాదు అత్యవసర సమయంలో ఆదుకుంటుందనే భావనతో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. 8లో



జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ. వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

గురుకుల ప్రవేశాలకు ఎంపిక జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9 తరగతుల సీట్ల భర్తీకి ఎంపిక జాబితా సిద్ధమైంది. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 63 సీట్లకు మొత్తం 1,301 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 957 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. మెరిట్ జాబితా ప్రకారం అన్ని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. ఎంపికైన విద్యార్థులకు సంబంధించి బాలురకు నార్పల బీసీ గురుకుల పాఠశాలలో జూలై 2న, బాలికలకు 3న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కౌన్సెలింగ్ జోనల్ ఆఫీసర్ రాజేంద్రనాథకుమార్‌రెడ్డి, కన్వీనర్ సంగీతకుమారి ఓ ప్రకటనలో తెలియజేశారు. 1:2 నిష్పత్తిలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. మెరిట్ విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేస్తామని వెల్లడించారు.

హిందూపురం నుంచి 'యాత్ర స్పెషల్' బస్సులు

హిందూపురం: ప్రతి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు, శనివారం సాయంత్రం 5 గంటలకు హిందూపురం డిపో నుంచి కర్ణాటక రాష్ట్రం చిక్‌మంగళూరు వద్ద ఉన్న దాదా పహాడ్‌కు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం శ్రీకాంత్ తెలిపారు. దాదా పహాడ్ యాత్రకు రానుపోను బస్సు చార్జీలు ఒకరికి రూ.1,480 అవుతుందన్నారు. అలాగే జూలై 20న పౌర్ణమి సందర్భంగా తమిళనాడు అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కరికి రానుపోను చార్జీలు రూ.1,320 ఉంటుందన్నారు. అలాగే జూలై 12న, ఆగస్టు 9వ తేదీన హిందూపురం డిపో నుంచి అయోధ్య, కాశీ యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అయోధ్య, కాశీయాత్ర 8 రోజులు ఉంటుందన్నారు. 14 పుణ్యక్షేత్రాలు దర్శించడానికి ఒకరికి టికెట్ ధర రూ.8,500 ఉంటుందని చెప్పారు. ప్రత్యేక యాత్ర స్పెషల్ బస్సుల సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టికెట్లు కావాల్సిన వారు 9440834715 నంబరును సంప్రదించవచ్చన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్



కొక్కంటి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అధికారులు

తనకల్లు: మండలంలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. డీపీఓ నాగరాజు, ఐడీఎస్‌పీ సుబ్బారావు పీహెచ్‌సీ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలను అందజేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలింతలు, గర్భిణులు, విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రక్తం తక్కువగా ఉన్న బాలింతలు, గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలని తల్లులకు తెలిపారు. అనంతరం కోటపల్లి సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఏఎన్‌ఎం పద్మావతి, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ చందన పాల్గొన్నారు.

ఎస్కేయూ వీసీ రాజీనామా

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీకి అధికారికంగా సమాచారం పంపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఇది వరకు పని చేస్తున్న వీసీలు, రిజిస్ట్రార్‌లు రాజీనామా చేయాలని అధికారికంగా కోరడంతో ఎస్కేయూ వీసీ అనివార్యంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. శుక్రవారం ఉదయమే వీసీ బంగ్లా నుంచి వెళ్లిపోయిన ఆయన అనంతపురంలో తన నివాసం నుంచి రాజీనామా లేఖను యూనివర్సిటీకి, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీకి పంపారు.

- హుస్సేన్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 17న ఎస్కేయూ వీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్కేయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని టీడీపీ కార్యకర్తల ఒత్తిళ్ల మేరకు తొలగించి అప్రతిష్ట మూట గట్టుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తే మీ పదవికి ఢోకా లేదని చెప్పి, పని పూర్తయ్యాక ఆయన్ను పదవీచ్యుతుడ్ని చేశారు.

సీజనల్ టెన్షన్



జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఇప్పటికే టైఫాయిడ్, డయేరియా కేసులు వందల్లో నమోదయ్యాయి. డెంగీ కూడా చాపకింద నీరులా విస్తరిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. అయితే పరిసరాల పరిశుభ్రత పాటు ఆహార విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులను నియంత్రించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

- వర్షాల ప్రభావంతో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- ఇప్పటికే వందల్లో టైఫాయిడ్, డయేరియా కేసులు
- 36 మందికి పైగా డెంగీ నిర్ధారణ
- పరిసరాల శుభ్రతతో వ్యాధులకు చెక్ పెట్టొచ్చంటున్న వైద్యులు



కమ్మవారిపల్లిలో కలుషితమైన నీటి ట్యాంక్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా నిర్మూలన అధికారి కుళ్లాయప్పనాయక్

జిల్లాలో సీజనల్ వ్యాధుల కేసుల సంఖ్య ఇలా...	
టైఫాయిడ్ కేసులు	415
డయేరియా కేసులు	1,063
డెంగీ కేసులు	36

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇటీవల వర్షాలు కురవడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలు చిత్తడిగా మారాయి. ఆరు బయటి ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు, అపరిశుభ్రత వలన దోమలు, బ్యాక్టీరియాలు, సూక్ష్మక్రిములకు అవాసంగా మారిపోయాయి. దీంతో జనం సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గన్యా బాధితులతో నిండిపోతున్నాయి.

సీజనల్ వ్యాధులకు కారణాలివే...

సీజనల్ వ్యాధులు దోమకాటుతో పాటు కలుషిత ఆహారం తినడం వల్ల సోకుతాయి. మనిషికి దోమ కుట్టినప్పుడు దాని లాలాజలం కలిసిపోయిన సూక్ష్మ జీవులు మనిషి రక్తంలో చేరి రోగాలను కలుగజేస్తాయి. దోమకాటు వల్ల ప్రధానంగా చికున్ గన్యా, డెంగీ, మలేరియా, మెదడువాపు, ఫైలేరియా వంటి రోగాలు వస్తాయి. కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం మూలంగా టైఫాయిడ్, కామెర్లు, వాంతులు, విరేచనాలు సంభవిస్తాయి. వీటితో పాటు ప్రమాదకరమైన అతిసారంతో నీళ్ల విరేచనాలు, వాంతులు ఎక్కువ అవుతాయి. దీని ద్వారా శరీరంలో నీటి శాతం పడిపోయి మనిషి పూర్తిగా నీరసించి తక్కువ సమయంలోనే పూర్తి ప్రమాదంలో పడిపోయే అవకాశం ఉంటుంది.

డెంగీ

ఈడీస్ అనే దోమ జాతి కాటు వల్ల డెంగీ వస్తుంది. అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తల, ఒళ్లు, విపరీతంగా నొప్పులు ఉంటాయి. ఒక్కోసారి శరీరంలోని భాగాలలో రక్తస్రావం , కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరం భాగాలలోని చర్మంపై ఎర్రగా కందినట్లు పొక్కులు వస్తాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయి ఒక్కోసారి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుంది.

చికున్ గన్యా

ఏడిస్ ఈజిప్టీ దోమ కాటు వల్ల చికున్ గన్యా వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారు తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడతారు. జ్వరం తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుంటుంది.

ఫైలేరియా

ఫైలేరియా వ్యాధి మైక్రోఫిలేరియా దోమకాటు వలన వస్తుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోధకాలు వ్యాధి వస్తుంది. దీని వల్ల జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, అవయవాలు వాపు, చేతులు, స్తనాలు, వరిబీజం, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

మెదడువాపు వ్యాధి

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల మెదడువాపు వ్యాధి వస్తుంది. జపనీస్ ఎన్సెఫాలిటీస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 సంవత్సరాల వయస్సున్న పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది. ఆకస్మికంగా ఎక్కువ తీవ్రతతో కూడిన జ్వరం ఉంటుంది. వ్యాధి తీవ్రత అధికమైతే విపరీతమైన తలనొప్పి, వాంతులు, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడం, శరీరంలో ఏదో ఒక పక్క పక్షవాతానికి గురి కావడం, ఫిట్స్ కూడా వచ్చే అవకాశం ఉంది.

మలేరియా

ఆడ ఎనాఫిలిస్ దోమకాటు వల్ల మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉన్న చోట వృద్ధి చెందుతుంది. ఈ దోమ కాటు వేసినప్పుడు దాని లాలాజలంలో ఉన్న మలేరియా క్రిములు మానవ శరీరంలో ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. క్రిములు శరీరంలో ప్రవేశించిన 14 రోజుల తరువాత తీవ్రమైన జ్వరం వస్తుంది.

టైఫాయిడ్

సాల్మనెల్లో టైపీ అనే బ్యాక్టీరియా వల్ల టైఫాయిడ్ వస్తుంది. కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం వల్ల వస్తుంది.

హెపటైటిస్–ఏ

వర్షాకాలంలో హెపటైటిస్ –ఏ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. కలుషితమైన నీరు , ఆహారం ద్వారా ఈ వ్యాధికి సంబంధించిన సూక్ష్మ క్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇది కాలేయ కణాల్లో సంక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరూబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీరం పసుపు రంగులోకి మారుతుంది.

జిల్లా వ్యాప్తంగా 41 పీహెచ్‌సీలు

జిల్లా వ్యాప్తంగా జిల్లా ఆస్పత్రితో పాటు 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3 ఏరియా ఆస్పత్రులు,7 కమ్యూనిటీ ఆస్పత్రులు, 18 అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈసీజన్‌లో ఇప్పటి వరకు 36 డెంగీ కేసులు, రెండు మలేరియా కేసులు, 200 వరకూ టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 135 ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ, టైఫాయిడ్ మలేరియా కేసులో మరో 300 వరకు ఉండోచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య పరీక్షలు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో 70 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చేవారికి తొలుత డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నెగిటివ్ అని తేలితే మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఆస్పత్రుల్లో నిర్వహించే ర్యాపిడ్ డెంగీ పరీక్షలలో పాజిటివ్ వస్తే వారిని కదిరి, హిందూపురం ప్రభుత్వాస్పత్రులకు తరలిస్తున్నారు. అక్కడ ఏలీసా పరీక్ష నిర్వహించి పాజిటివ్ వస్తే అక్కడే అడ్మిట్ చేసుకుని వైద్యం అందిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల అడ్డుకట్టకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వాటికి అడ్డుకట్ట వేసేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాలు, పట్టణాల పరిధిలోని క్షేత్ర స్థాయి సిబ్బంది ఆయా ప్రాంతాలలో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు. దోమలను నియంత్రించే పద్ధతులను ప్రజలకు వివరిస్తున్నారు.

వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నీరు నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. క్రిమిసంహారక మందులు, కిరోసిన్ చల్లాలి.
- ఇంట్లో, ఇంటి చుట్టూ పనికిరాని కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, సీసాలు లేకుండా చూసుకోవాలి.
- ఇంట్లోని కిటికీల ద్వారా దోమలు ప్రవేశించకుండా నెట్ ఏర్పాటు చేసుకోవాలి. వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలి.
- వారంలో ఒకరోజును డ్రైడేగా పాటించాలి.

సిబ్బందిని అప్రమత్తం చేశాం



సీజనల్ వ్యాధులు ఇంకా ప్రారంభదశలోనే ఉన్నాయి. వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే వైద్యసిబ్బందిని అప్రమత్తంగా చేశాం. అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాం. జ్వరంతో బాధపడుతూ వచ్చే ప్రతి ఒక్కరికీ డెంగీ, మలేరియా పరీక్షలు చేయాలని ఆదేశించాం. ఏ రకమైన అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే ప్రజలు సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

– డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్‌ఓ

దోమల వ్యాప్తి నిర్మూలనకు చర్యలు



సీజనల్ వ్యాధులను కట్టడి చేయాలంటే దోమల నిర్మూలన ఒక ముఖ్యమైన కార్యక్రమం. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నాం. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని చెబుతున్నాం. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– కేసీ కుళ్లాయప్పనాయక్, జిల్లా మలేరియా నివారణ అధికారి

హోరాహోరీగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



తలపడుతున్న అనకాపల్లి - ఏలూరు జట్లు

ధర్మవరం రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి హాకీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రెండోరోజు పోటీల్లో భాగంగా తిరుపతి – నంద్యాల జట్లు పోటీ పడ్డాయి. 5–1తో తిరుపతి జట్టు గెలిచింది. అదేవిధంగా వైఎస్సార్ జిల్లా – శ్రీకాకుళం జట్లు పోటీ పడగా 5–1తో వైఎస్సార్ జిల్లా విజయం సాధించింది. శ్రీసత్యసాయి–నెల్లూరు జట్లు తలపడగా 7–1తో శ్రీసత్యసాయి జట్టు గెలుపొందింది, గుంటూరు–కర్నూలు తలపడగా 2–0తో గుంటూరు విన్ అయింది. అనంతపురం–ఎన్టీఆర్ జిల్లా జట్లు తలపడగా 5–3తో అనంతపురం విజయం సాధించింది, అనకాపల్లి–ఏలూరు పోటీపడగా 12–0తో అనకాపల్లి గెలుపొందింది. వైఎస్సార్ జిల్లా–నంద్యాల తలపడగా 4–1తో వైఎస్సార్ జిల్లా విజయం సాధించింది. అలాగే శ్రీసత్యసాయి జిల్లా–గుంటూరు జిల్లా తలపడగా 3–1తో శ్రీసత్యసాయి జిల్లా విజేతగా నిలిచింది. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా చేనేత పారిశ్రామికవేత్త జింకా రామాంజినేయులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హాకీ కార్యదర్శి సూర్యప్రకాష్, హాకీ జిల్లా సహాయ కార్యదర్శి అరవింద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరీ ప్రసాద్, మారుతీ, అమ్మద్దీన్, కిరణ్, కోచ్ హుసేన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మనస్వి చౌహాన్

నల్లమాడ: మండల పరిధిలోని నీరాలవంక తండాకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌నాయక్ కుమార్తె మూడే మనస్వి చౌహాన్ రాష్ట్రస్థాయి అండర్–11 బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం అనంతపురంలో జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా డబుల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్ 11 బాలికల విభాగంలో మూడే మనస్వి చౌహాన్ విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి జయకుమార్ చేతుల మీదుగా మొమెంటో అందుకుంది. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మనస్వి చౌహాన్ పాల్గొంటుందని జయకుమార్ తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులు, అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.సత్యవాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. అన్ని రకాల కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాదభరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ టాక్స్ కేసులు, మునిసిపల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులు అందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోండి



పోలీస్ అధికారులకు శిక్షణ ఇస్తున్న ఐటీ కోర్ టీం అధికారి సుదర్శన్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: జూలై 1వ తేదీ నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి అవగాహన పెంచుకోవాలని అడినల్ ఎస్పీ విష్ణు తెలిపారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఐటీ కోర్ ఆధ్వర్యంలో పుట్టపర్తి సబ్‌డివిజన్ పోలీస్ అధికారులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ విష్ణు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... జూలై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్, సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం నూతన చట్టాలు అమలు కానున్నాయన్నారు. కొత్తచట్టాల అమలులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై అవగాహన పెంచుకొని బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి? తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఐటీ కోర్ టీం అధికారి సుదర్శనరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డాక్టర్ ఉదయ్‌పై కేసు నమోదు

- ఏఎన్‌ఎంలపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో వైద్యుడి మెడకు బిగుస్తున్న ఉచ్చు
- విచారణ నివేదికను డీఎంహెచ్‌ఓకు అందజేసిన కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: ఏఎన్‌ఎంలను లైంగికంగా వేధిస్తున్నాడన్న ఆరోపణలపై చెన్నేకొత్తపల్లి మండలం ఎన్‌ఎస్‌గేట్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఉదయ్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే... డాక్టర్ ఉదయ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని, అలాగే అసభ్యకర మెసేజ్‌లు పెడుతూ ఇబ్బంది పెడుతున్నాడని ఎన్‌ఎస్‌గేట్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు కూడా చేశారు. వెంటనే డీఎంహెచ్‌ఓ మంజువాణి కూడా స్పందించి అధికారులతో కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. కమిటీ సభ్యుల విచారణకు సైతం డాక్టర్ ఉదయం దుమ్మా కొట్టాడు. విధులకు కూడా హాజరుకాలేదు. దీంతో వారు బాధితులతో వివరాలను కనుక్కొని డీఎంహెచ్‌ఓకు నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో తాజాగా శుక్రవారం బాధిత ఏఎన్‌ఎంలు చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా డాక్టర్ ఉదయ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఉదయ్‌పై కేసు నమోదు చేసినట్లు చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తుంగభద్రకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

- 5 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో నీరు అడుగంటింది. కొద్ది రోజుల క్రితం ఇన్‌ఫ్లో కాస్త పెరిగి నీటి నిల్వ 6 టీఎంసీలు దాటింది. ఈ స్థితిలో ఎగువ భాగంలో వర్షాలు నిరాశాజనకంగా ఉండడంతో నీటి నిల్వ 5 టీఎంసీలకు పడిపోయింది. దీంతో జలాశయం కళ తప్పింది. టీబీ డ్యాం పూర్తి నీటిమట్టం 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కాగా.. శుక్రవారం ఉదయానికి 1581.33 అడుగులతో 5.154 టీఎంసీల నీరు నిల్వం ఉంది. ఇన్‌ఫ్లో 879, అవుట్ ఫ్లో 297 క్యూసెక్కులుగా నమోదైంది. కర్ణాటకతో పాటు ఆంధ్రాలోని అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలకు సాగు, తాగునీరందిస్తున్న టీబీ డ్యాం రెండేళ్లుగా అన్నదాతలను నిరాశపరుస్తోంది. తుంగభద్ర జలాశయం పైభాగంలోని ఆగుంబే, వరనాడు, శివమొగ్గ, తీర్థనహళ్లి, శృంగేరి తదితర ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు తగ్గాయి. దీంతో ఎగువ నుంచి వరద లేకపోవడంతో జలాశయం నీరు లేక వెలవెలబోతోంది. అయితే ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశాలుండటంతో రైతులు డ్యాం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 1578.33 అడుగుల నీటి మట్టంతో 3.713 టీఎంసీల నీరు నిల్వ ఉండి, 462 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,698 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆచార్య సి.శశిధర్, డాక్టర్ కె.మమత

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) నూతన ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వర్సిటీ పురోగతికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

రైతును కాటేసిన పాము

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామానికి చెందిన రైతు నాగరాజును పాము కాటేసింది. తన తోటలో శుక్రవారం ఉదయం ఆయన పనులు చేస్తుండగా కుడి చేతిపై పాము కాటు వేయడంతో వెంటనే అక్కడే ఉన్న రైతులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బంగారంతో ఇబ్బందులు దూరం

- హిందూపురంలోని ముక్కడిపేటకు చెందిన మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆ సమయంలో అవసరమైన డబ్బు లేకపోవడంతో ఆయన భార్య తన బంగారు నగలు తీసుకెళ్లి బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకుంది. గాయపడిన భర్తను బెంగళూరులోని ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు దక్కించుకుంది.
- అనంతపురం జిల్లా పామిడి గ్రామానికి చెందిన నైటీల వ్యాపారి కొన్నేళ్ల క్రితం అత్యవసర పనిపై హైదరాబాద్‌కు కారులో వెళుతూ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చెర్ల వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించాడు. కుటుంబ పోషణ భారం మొత్తం భార్యపై పడింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించడంతో తన బంగారు నగలు బ్యాంక్‌లో తాకట్టు పెట్టి బీటెక్ చదివించింది. ప్రస్తుతం కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ తల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు.

.... ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులను బంగారం తీరుస్తోంది. అత్యవసర సమయంలో ఎవరినీ ప్రాధేయపడకుండా బంగారు నగలను బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకుని జీవితాలను సరిదిద్దుకుంటున్నారు.



- సులువుగా బంగారు తాకట్టు రుణాలు మంజూరు చేస్తున్న బ్యాంకులు
- నిమిషాల్లోనే చేతికి నగదు
- అత్యవసర సమయంలో ఆదుకుంటున్న బంగారు నగలు

హిందూపురం అర్బన్: బంగారం ఇష్టపడని మనిషే ఉండదు. ఇప్పటి వరకు మహిళలే ఎక్కువగా మక్కువ చూపించేవారు. ఇప్పుడు వీరితో పురుషులు సైతం పోటీ పడుతున్నారు. అయితే అలంకరణ విషయంగా కాకుండా అత్యవసర సమయంలో ఆదుకుంటుందనే భావనతోనే బంగారాన్ని కొనుగోలు చేసే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అవసరానికి ఎవ్వరినీ ప్రాధేయ పడకుండా తమ వద్ద ఉన్న బంగారాన్ని తీసుకెళ్లి బ్యాంకుల్లో తాకట్టు పెట్టి క్షణాల్లో నగదు పొందవచ్చుననే ధోరణి అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఆర్థిక ఇబ్బందులు దూరమైన తర్వాత బ్యాంకుల్లో తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా రూ.కోట్లలో బంగారు తాకట్టు రుణాల లావాదేవీలు కొనసాగుతున్నట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

పోటీ పడుతున్న ఫైనాన్స్ కంపెనీలు..

బంగారు నగల తాకట్టుపై రుణాలు మంజూరు చేసే అంశంలో బ్యాంకర్లతో వివిధ ఫైనాన్స్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. దీంతో తమకు డబ్బు అవసరమున్న ప్రతిసారీ ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు నగలు తీసుకెళ్లి తాకట్టు పెట్టేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు, విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, నూతన వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారు రుణాల కోసం బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయానికి తక్కువ వడ్డీకే జాతీయ బ్యాంకులు రుణాలు ఇస్తుండటంతో వడ్డీ వ్యాపారుల జోలికి వెళ్లే వారి సంఖ్య తగ్గుతోంది. అవసరానికి అప్పులు పుట్టని పరిస్థితుల్లో ఎక్కువ మంది బంగారు రుణం తీసుకునేందుకే ప్రాధాన్యత నిస్తుండడం గమనార్హం. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేస్తే తీర్చడం తలకు మించిన భారమవుతున్న ప్రస్తుత తరుణంలో బంగారు నగలు ఇంట్లో ఉంచుకునేదాని కంటే బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకుని వ్యాపార, వాణిజ్య రంగాల్లో పెట్టే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో ఆర్థిక పరిపుష్టి ఉన్న వారు సైతం బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకుని ఇతర రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు.

నాణ్యత ఆధారంగా రుణం..

తాకట్టు పెట్టే బంగారం నగల నాణ్యతను బట్టి బ్యాంకర్లు రుణం మంజూరు చేస్తున్నారు. 24 క్యారెట్ల మేలిమి బంగారమని బ్యాంక్ అధికారిక అప్రైజర్ నిర్ధారిస్తే మార్కెట్ ధరలో 90 శాతం వరకూ రుణం మంజూరవుతోంది. నాణ్యత తక్కువగా ఉంటే 70 నుంచి 80 శాతం వరకు రుణం మంజూరు చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.72వేలు ఉంది. ఈ లెక్కన పది గ్రాముల బంగారు ఆభరణానికి రూ.50 వేలకు పైగా రుణం మంజూరవుతోంది. వాయిదాలు సక్రమంగా చెల్లించేదానిపై వడ్డీ ఆధారపడి ఉంటుంది.

బ్యాంకుల్లో కిలోల కొద్దీ బంగారం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నగదు అవసరాల కోసం బంగారం తనఖా పెడుతున్న వారి సంఖ్య క్రమేణ పెరుగుతోంది. కొన్ని బ్యాంకుల్లో అప్రైజర్లు, రుణాలు మంజూరు చేసే సిబ్బంది ఈ సీజన్‌లో రోజంతా అదే పనిలో ఉండాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్యాంకులు కలిపి ప్రతి నెలా రూ.25 కోట్లకు పైగా బంగారు రుణాలు మంజూ చేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఉమ్మడి అనంతపురం జిల్లాలో కిలోల కొద్దీ బంగారం తాకట్టు రూపంలో వివిధ బ్యాంకుల్లో భద్రంగా ఉంటోంది.

అప్పు తీర్చకపోతే వేలం..

బంగారు రుణాలపై వడ్డీలు రకరకాలు ఉంటాయి. రైతులు తీసుకునే రుణాలు, వాణిజ్య పరంగా తీసుకునే రుణాలు, మధ్య తరగతి ప్రజలు అత్యవసరాలకు తీసుకునే రుణాలకు సంబంధించి వారి అవసరాన్ని బట్టి వాయిదాలు నిర్ణయించి రుణం మంజూరు చేస్తున్నారు. 3, 6, 12 నెలల వాయిదాలు ఎక్కువ మంది తీసుకుంటున్నారు. బంగారు తాకట్టుపై రుణం తీసుకున్న వారు నిర్ణీత గడువు లోపు అసలు చెల్లించకపోతే తొలుత బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తారు. స్పందించక పోతే సదరు నగలను వేసి తమ డబ్బు రాబట్టుకుంటారు.

రక్తదాతకు అనంత కలెక్టర్ ప్రశంస



అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న చంద్రశేఖర్

ధర్మవరం రూరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు ప్రత్యేకంగా శిబిరాలను నిర్వహించి సహకరించిన వారిని శుక్రవారం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి, అభినందించారు. ఇందులో రక్త బంధం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, రక్తదాతలను ప్రోత్సహించిన ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన చంద్రశేఖర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తదాతలను ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు.

ఆర్‌టీపీపీ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎన్నికైన అధ్యక్షకార్యదర్శులను సన్మానిస్తున్న భాషా పండితులు

హిందూపురం: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (ఆర్‌టీపీపీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. హిందూపురం మండలం కొట్నూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. సమావేశంలో భాషా పండితుల సమస్యలు, డీఈఓ పూల్ తదితర అంశాలపై చర్చించి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై తీర్మానాలు చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఎర్రిస్వామి వ్యవహరించారు. గౌరవాధ్యక్షుడిగా జి.ఆనంద్, అధ్యక్షుడిగా పూజారి రెడ్డప్ప, సహాధ్యక్షులుగా డి.గంగులప్ప, బి.సురేష్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.గోవిందు, సంయుక్త కార్యదర్శిగా కె.బాబు, ఆర్థిక కార్యదర్శిగా డి.విజయకుమార్, కార్యదర్శిగా ఎస్.రమేష్ బాబు, ఎన్.రఘుపతి, సలహాదారులుగా జి.శ్రీనివాసులు, అబ్దుల్ నిషార్, బి.చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వెంకటరమణ, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర కుమార్, అధ్యక్షుడు హనుమేష్, కార్యదర్శి తులసిరెడ్డి పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు సమీపంలో కోడిపందేలు ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... ముందస్తు సమాచారంతో శుక్రవారం ఉదయం గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముళ్ల పొదల మధ్య కోడి పందేలు ఆడుతున్న ఎనిమిది మందిని గుర్తించి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.26,150 నగదుతో పాటు ఐదు కోడి కత్తులు, ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

THE ANANTAPUR DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD., ANANTAPUR.

BALANCE SHEET (Amount in Rupees)

Description	Sch	As on 31-03-2024 (Current Year)	As on 31-03-2023 (Previous Year)
Capital and Libilities			
Capital	1	1,21,62,11,065.40	1,14,72,26,068.87
Reserves and Surplus	2	1,29,57,36,294.37	1,28,75,96,824.91
Deposits	3	5,24,04,01,345.25	5,13,71,09,955.66
Borrowings	4	10,38,62,55,231.80	8,25,53,16,678.80
Other Liabilities and Provisions	5	1,53,98,80,701.32	1,39,14,87,004.05
Total		19,67,84,84,638.14	17,21,87,36,532.29
Assets			
Cash and balances with Reserve Bank of India	6	10,46,99,969.00	11,49,30,122.00
Balance with banks and money at call and short notice	7	2,55,99,82,446.02	2,70,02,90,731.90
Investments	8	1,72,50,53,899.27	1,71,78,83,322.04
Advances	9	13,65,47,94,552.40	11,05,16,84,317.44
Fixed Assets	10	1,22,95,50,306.35	1,23,77,37,451.39
Other Assets	11	40,44,03,465.10	39,62,10,587.52
Total		19,67,84,84,638.14	17,21,87,36,532.29
Contingent Liabilities	12	4,83,06,438.00	67,20,454.20

* Significant Accounting Policies & Notes to Accounting annexed
* The scheduled referred to above from an Integrappart of the Balance Sheet, asper our attached report of even date.
Note : Previous Year figures are regroups/reclassified where ever necessary to suit current year layout.

PROFIT & LOSS (Amount in Rupees)

Description	Sch	As on 31-03-2024 (Current Year)	As on 31-03-2023 (Previous Year)
Income			
Interest earned	13	1,23,36,51,339.40	77,44,17,578.10
Other income	14	2,55,50,840.40	16,82,02,720.60
Total		1,25,92,02,179.80	94,26,20,298.70
Expenditure			
Interest expended	15	92,12,80,963.02	64,05,54,524.70
Operating expenses	16	32,60,61,684.96	29,16,40,293.59
Provisions and contingencies			
Total		1,24,73,42,647.98	93,21,94,818.29
Profit / Loss		1,18,59,531.82	1,04,25,480.41
Net profit / loss (-) for the year After Tax			
"Profit / loss (-) brought forward"			
Total		1,18,59,531.82	1,04,25,480.41
Appropriations			
Reserve Fund			
Dividend Equilisation Fund			
Investment Fluxation fund			
Agri., Stabilisation Fund			
Education Fund			
Building Fund			
UDP		1,18,59,531.82	1,04,25,480.41

Date: 29-05-2024
Place : Anantapur.

NOTES ON ACCOUNTS

i) SLR Investment Permanent = Gsec - Rs 12600.72 lakhs
ii) Non SLR Investments - Rs 4649.82 lakhs
iii) No loans had been issued to Directors
iv) No Bank Gurantees as on 31-03-2024
v) Average Cost of Deposits - 5.82
vi) NPAs a) Gross NPAs - Rs 10712.60 Lakhs (7.85%)
b) Net NPA - Rs 4761.19 Lakhs (3.65%)
vii) Provision for NPAs - 4440.23 Lakhs
viii) Provision for Standard Assets - 389.62 Lakhs
ix) Insurance premium to DICGC had been paid - 60.35 Lakhs

For AM Reddy & DR Reddy Chartered Accounts
FRN: 009068S
Sd/- CA R.Rama Ravisankar Reddy M.No.217160

For The Anantapur District Cooperative Central Bank Ltd.,
Sd/- K.Surekha Rani CEO (FAC)

Note : Financial Statememts are yet to be adopted by General Body of the Bank

ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు లక్ష్మీకాంతప్ప

మడకశిర రూరల్: మండలంలోని బుళ్ల సముద్రం సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం బి.రాయాపురం గ్రామానికి చెందిన లక్ష్మీకాంతప్ప (49), సన్నమ్మ శుక్రవారం ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళుతుండగా బుళ్ల సముద్రం సమీపంలో ఆటోను ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో లక్ష్మీకాంతప్ప, సన్నమ్మ రోడ్డుపై పడ్డారు. లక్ష్మీకాంతప్పకు ఎడుమ కాలు విరిగింది. చెవి, నోటి నుంచి రక్త రావడంతో వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రీ సర్వే గ్రామాల భూములకు రిజిస్ట్రేషన్

- జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్

అనంతపురం టౌన్: గ్రామాల్లో రీ సర్వే చేసిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల పక్రియ గత మూడు నెలలుగా ఆగిపోయింది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని వ్యవసాయ భూములకు సర్వే నంబర్‌తో పాటు ఎల్‌పీ నంబర్‌ను కొత్తగా కేటాయించారు. ఈ క్రమంలో ఎల్‌పీ నంబర్లతో రిజిస్ట్రేషన్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన నూతన సాఫ్ట్‌వేర్ (కార్డ్ ప్రైమ్ 2.0) అనుసంధానం కాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో గ్రామాల్లోని వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో భూముల క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండు నెలలకు పైగా కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రధానంగా కురుగుంట, రాచానపల్లి, బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లి, రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున వెంచర్లు వెలిశాయి. ఈ గ్రామాల్లోని భూముల ఎల్‌పీ నంబర్ల వివరాలు సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండిపడింది. ఈ సమస్యను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్లు తీసుకెళ్లారు. దీంతో నూతన సాఫ్ట్‌వేర్‌కు రీ సర్వే గ్రామాల భూముల ఎల్‌పీ నంబర్ల వివరాలను అనుసంధానం చేసే పక్రియపై దృష్టి సారించారు. మరో రెండు మూడు రోజుల్లో అనుసంధాన పక్రియ పూర్తి కానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ తెలిపారు. ఈ ప్రకియ పూర్తి కాగానే జూలై మొదటి వారంలో రీ సర్వే చేపట్టిన గ్రామాల్లోని వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చిన్నారుల ఉజ్వల భవితకు బాటలు వేద్దాం



శిక్షణ ఇస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

హిందూపురం టౌన్: చిన్నారుల్లో లోపాలను గుర్తించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామంటూ జిల్లా త్వరిత చికిత్స కేంద్రం(డీఈఐసీ) వైద్యాధికారి డాక్టర్ ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా 0–5 ఏళ్లలోపు ఉన్న చిన్నారుల్లో లోపాలను గుర్తించేలా హిందూపురంలోని జిల్లాస్పత్రిలో ఉన్న డీఈఐసీలో శుక్రవారం వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ... పుట్టుకతో చిన్నారుల్లో వచ్చే లోపాలు, అంగవైకల్యం, ఎదుగుదల లోపాలు, పోషకాహారం లోపం సంక్రమించే వ్యాధులు, చలన, వినికిడి, మాట్లాడడం, గ్రహించడం, కంటిచూపు తదితర లోపాలు గుర్తించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చిన్నార్లుల్లో ఇలాంటి లోపాలను గుర్తించి వారికి హిందూపురంలోని డీఈఐసీ కేంద్రానికి రెఫర్ చేయాలన్నారు. డీఈఐసీ సేవలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అపర్ణ, ఆప్తోమెట్రీషియన్ సాయికృష్ణ, సీహెచ్‌ఓ వన్నప్ప, సిబ్బంది సూర్యశేఖర్‌రెడ్డి, రఘురామ్, సోషియల్ వర్కర్ మోహన్‌రెడ్డి, ఎల్‌టీ చందన తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



సురేఖ మృతదేహం

గుంతకల్లు రూరల్: మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన సురేఖ (18) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... దంచర్ల గ్రామానికి చెందిన బాలసుంకన్న, పార్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తనకున్న మూడెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ భార్యాపిల్లలను బాలసుంకన్న పోషించుకుంటున్నాడు. పెద్ద కుమార్తె సురేఖ పదో తరగతి వరకు చదువుకుంది. ఆ తర్వాత చదువులకు స్వస్తి చెప్పిన ఆమె తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనుల్లో పాల్గొంటూ కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. గత రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్న సురేఖ గురువారం నొప్పి తీవ్రత తాళలేక అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వేరుశనగ పంటకు కాపలాకు వెళ్లిన బాలసుంకన్న శుక్రవారం తెల్లవారుజాము 4 గంటలకు ఇంటికి చేరుకుని తలుపు కొట్టిన సమయంలో కుటుంబసభ్యులు నిద్ర లేచారు. అప్పటికే ఉరికి విగత జీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపిస్తూ తలుపు తీశారు. కుమార్తె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న బాలసుంకన్న సమాచారంతో గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

గూడ్స్ రైలు చక్రాలకు చుట్టుకున్న టార్పాలిన్



టార్పాలిన్ పట్టాను తొలగిస్తున్న సిబ్బంది

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ మీదుగా లోడ్‌తో వెళుతున్న గూడ్స్ రైలుకు శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. వ్యాగన్‌లపై కప్పిన టార్పాలిన్ పట్టా గాలికి ఎగిరి కొంత భాగం చక్రాలకు చుట్టుకుంది. విషయాన్ని గుర్తించిన లోకో పైలెట్ వెంటనే గూడ్స్‌ను స్టేషన్‌లోని రెండో ప్లాట్ ఫాంపై ఆపేశారు. అనంతరం రైల్వే సిబ్బంది సహకారంతో వ్యాగన్‌లపై ఒక వైపు వాలి కిందకు వేలాడుతున్న టార్పాలిన్ పట్టాలను తొలగించారు. వ్యాగన్‌లో ఉన్న సరుకు వర్షానికి తడవకుండా ఉండేందుకు కప్పిన టార్పాలిన్‌కు తాళ్లు సక్రమంగా కట్టకపోవడంతో గాలికి జారి కిందకు వచ్చినట్లుగా నిర్ధారించారు. అదే సమయంలో స్టేషన్ సమీపంలోకి చేరుకున్న తిరుపతి – హుబ్లీ ఇంటర్‌సిటీ రైలును మూడో ప్లాట్‌ఫాంలోకి మళ్లించారు. గూడ్స్ లోకో పైలెట్ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించి ఉన్నా.. వ్యాగన్ చక్రాలకు చుట్టుకున్న టార్పలిన్ కారణంగా పట్టాలు తప్పి పెను ప్రమాదం జరిగి ఉండేది.

సంపత్‌కుమార్ హత్యపై న్యాయ పోరాటం

- హత్య కారణాలను రాహుల్ గాంధీకి వివరిస్తాం
- డాక్టర్ కొప్పలరాజు



సంపత్‌కుమార్ తండ్రితో మాట్లాడుతున్న డాక్టర్ కొప్పలరాజు, తదితరులు

హిందూపురం: ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్‌కుమార్ హత్య ఉదంతాన్ని కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లి, హత్యోదంతంపై న్యాయ పోరాటం చేస్తామని ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల సమన్వయకర్త డాక్టర్ కొప్పులరాజు అన్నారు. నెల రోజుల క్రితం సంపత్‌కుమార్ హత్యకు గురైన విషయం తెలిసిందే. మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పీసీసీ కార్యదర్శి కేటీ శ్రీధర్, హిందూపురం కాంగ్రెస్ నాయకుడు శ్యాంకిరణ్‌తో కలసి హిందూపురంలోని సంపత్‌కుమార్ ఇంటిని శుక్రవారం ఉదయం డాక్టర్ కొప్పల రాజు సందర్శించారు. సంపత్‌కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. హత్యకు కారణాలు తెలుసుకుని న్యాయ పోరాటం చేస్తామని హామీనిస్తూ బాధిత కుటుంబసభ్యులకు తన వంతు సాయంగా రూ. లక్ష అందజేశారు. ఓ దళితుడు దారుణ హత్యకు గురైతే అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదని సంపత్‌కుమార్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన దోషులను ఇప్పటికీ అరెస్ట్ చేయలేదంటే పోలీసుల నిర్లక్ష్యం ఎంత మేరకు ఉందో అర్థమవుతోందని కొప్పల రాజు అసహనం వ్యక్తం చేశారు. దళితులపై చిన్న చూపు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సునామజకినీ మాత ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులో వెలసిన ఆరె కటికల ఆరాధ్య దైవం సునామజకినీ మాత ఆలయ నూతన పాలక మండలి సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఎం.ఎ.లక్ష్మణ్‌రావు, ధర్మకర్తగా కె.సురేష్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.కె.సాయినాథరావు, ప్రధాన కార్యదర్శిగా డి.భాస్కరరావు, కోశాధికారిగా హెచ్.సుధాకర్‌రావు, సహ కోశాధికారిగా ఎంకే బాబూరావు, మహిళా విభాగం ఆలయ కమిటీ అధ్యక్షురాలిగా ఎ.సరస్వతిబాయి ఎంపికైన విషయం తెలిసిందే. వీరు శుక్రవారం ఉదయం ఆలయంలో విశేష పూజల అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూడేరు: ధర్మవరానికి చెందిన అనిల్ అనే యువకుడు శుక్రవారం కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడిలో ఓ శుభకార్యాన్ని చూసుకుని ధర్మవరానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన అనిల్... జల్లిపల్లి వద్దకు చేరుకోగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంటలకు తాళలేక గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వారు గమనించి కాపాడారు. 108 అంబులన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.